# కొత్త జీవితం

విన్నకోట సుశీలాదేవి

నేనూ, కేశవరావు ఒకేసారి కాలేజీ లెక్చరర్లుగా చేరాం. అయితే మా జీవితాలు పూర్తిగా భిన్నమైనవి.

ఉద్యోగంలో చేరిన కొద్ది నెలలకే నేను పెళ్ళి చేసుకున్నాను. అప్పటి నుంచీ సంసార సాగరంలో పడి కొట్టుకుంటున్నాను.

కేశవరావు ఘోటక బ్రహ్మచారి.

చీకూ చింతా లేని జీవితం అతనిది. తన కొచ్చే జీతమంతా ఎల్.ఐ.సి. పేర - షేర్ల పేర - బ్యాంకు డిపాజిట్ల రూపంలో దాచేవాడు. తన్న అవసరాలకు కొద్దిగా ఉంచుకునేవాడు. ఏ నెలలోనైనా ఇంకా డబ్బు అవసరమైతే మిగిలిన లెక్చరర్ల దగ్గర అప్పు చేసేవాడే కానీ బ్యాంకులో దాచిన డబ్బు మాత్రం తీసేవాడు కాదు. ఇక అతని అవసరాలు కూడా చాలా పరిమితమైనవి. కడుపు నిండా తినడు - మంచి బట్టలు కట్టడు. ఎంత దూరమైనా నడిచే వెళ్ళేవాడు.

"మరీ ఇంత పీనాసివాడేమిటోయ్ !"

"డబ్బంతా ఏం చేస్తాడు. కట్టుకుపోతాడా".

"చివరికి ఎవడికి దక్కుతుందో," మా కొలీగ్స్ ఇలా కామెంట్లు విసిరేవారు - ఎవరైనా ఏదైనా ప్రశ్నించినా అన్నిటికీ చిరునవ్వే సమాధానంగా ఇచ్చేవాడు.

నేనే అప్పుడప్పుడు - కేశవ్! ఇప్పటికైనా పెళ్ళి



చేసుకోకూడదా!'' అనేవాడిని.

''పెళ్ళి చేసుకుంటే ఇలా స్థిమితంగా కూర్చుని చదువుకునే అవకాశం ఉంటుందా చెప్పు'' అనేవాడు.

కేశవరావు విపరీతంగా చదివేవాడు. ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పట్టా పొందాడు. అంతేగాక ఇంగ్లీషు - ఫిలాసఫీలో కూడా ఎం.ఏ. డిగ్రీలు సంపాదించాడు. వివిధ మేగజైన్లకు తరచూ వ్యాసాలు రాసేవాడు. కాలేజీలో మంచి టీచరుగా పేరు పొందాడు. క్లాసులో ఎన్నో కొత్త విషయాలు చెప్తాడని స్టూడెంట్లు క్లాసులకు రెగ్యులర్‌గా వెళ్లేవారు.

అతనన్నట్టు పెళ్ళి చేసుకుంటే... ఇంతటి విద్యావ్యాసంగం చేయడం చాలా కష్టం.

చూస్తుండగానే మాకు రిటైరయ్యే వయసొచ్చేసింది. రిటైరయ్యాక ఎలా జీవితం గడపాలా అని బెంగ పెట్టుకున్నాను.

నాకున్న ముగ్గురు కూతుళ్ళల్లోనూ ఒక్క అమ్మాయికే పెళ్ళి చేశాను. ఇంకా ఇద్దరికి చెయ్యాలి. కొడుక్కి నవ్యమైన ఉద్యోగం రాలేదు. ఆలస్యంగా పుట్టిన చిన్న కొడుకు హైస్కూలు స్థాయిలోనే ఉన్నాడు. ఇంకా సొంత ఇల్లు ఉండాలని అప్పు చేసి కట్టాను. ఆ అప్పు ఇంకా తీరలేదు.

నెలనెలా జీతం వస్తోంటేనే ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఇక సగం జీతంతో ఎలా బ్రతికేది?

కేశవరావు ఇటువంటి బాదరబందీలేమీ లేవు. ''రిటైరయి పోతున్నావ్ కదా! నీ డబ్బంతా ఏం చేస్తావోయ్!''

''దాన ధర్మాలు చేస్తాడేమో!''

''పోనీ నన్ను పెంచుకోకూడదూ!''

మా కొలీగ్స్ కామెంట్లు విసిరేవారు.

నా క్కూడా అతని భవిష్యత్తు జీవితం గురించి పెద్ద సస్పెన్సుగా ఉండేది.

అతని నిరాడంబర జీవితం చూస్తోంటే రిటైరయ్యాక ఏ ఆశ్రమంలోనో చేరిపోతాడేమో' అన్పించేది.

ఏదైనా అదృష్టవంతుడు!

'సంసార సాగరంలోకి దూకి కష్టాలు పడలేదు' అనుకుని అసూయ పడసాగాను.

మా ఉద్యోగ విరమణ రోజున కాలేజీలో సభ ఏర్పాటు చేశారు. అతనెంతో సంతోషంగా ఉన్నట్టు కన్పించాడు ఆ రోజు!

నాకు మాత్రం దుఃఖం పొర్లుకు వచ్చింది!

'నిన్న - మొన్న ఉద్యోగంలో చేరినట్టుగా ఉంది. అప్పుడే పాతిక సంవత్సరాలు గడిచిపోయాయి. ఇన్నేళ్ల జీవితంలో నేను ఏం అనుభవించాను? నేను సుఖపడ్డ క్షణాలు గుర్తుకు రావడంలేదు.

డబ్బు ఇబ్బందులు - పిల్లలు రోగాలు - భార్య అనారోగ్యం - బంధువులు నెలల తరబడి ఉండిపోవడం. ఆ తర్వాత' పిల్లల చదువుల బెంగ - ఇల్లు కట్టాలనే దిగులు.

ఇలా అనేక సమస్యల్తో బాధపడ్డ రోజులే ఎక్కువ 'జ్ఞాపకం వస్తున్నాయి.

అప్పుడే నా జీవితం అయిపోయింది.

మిగిలిన జీవితమంతా ఒకటే! జీవచ్ఛవంలా బ్రతుకుతూ మృత్యువును ఎదురుచూడటమే ఇక నా పని.

''ఏమిటలా ఉన్నావ్'' ఫంక్షనయ్యాక కేశవరావు అడిగాడు. నీకేమోయ్! ఏ చీకూ చింతా లేదు. రేపట్నించి నాకెన్ని సమస్యలు!''



''ఇప్పుడు మాకు ఏ గొడవా లేకుండా ఇరుగూ, పొరుగూ నిశ్శబ్దంగా ఉంది'' అంది సుబ్బలక్ష్మి.
''మీరు కూడా ఇల్లు మార్చారా?'' ప్రశ్నించింది వెంకట లక్ష్మి.
''మేం మార్చలేదు... వారు మార్చాక..'' అంది సుబ్బలక్ష్మి.

''కష్టాలు - సమస్యలు మనుషులందరికీ వస్తూనే ఉంటాయి. ఏవన్నా సహాయం కావాలంటే అడుగు'' అన్నాడు.

అతని నోటి వెంట ఆ మాటలు నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఎందుకంటే తన సర్వీసు కాలంలో కాకి క్కూడా ఎంగిలి మెతుకులు రాల్చని పిసినారిగా పేరు పొందాడు.

అతని మాటకే పొంగిపోతూ ''అలాగే'' అన్నాను.

''తరచూ ఉత్తరాలు రాస్తూంటాడు. అన్నాడు. 'నువు మీ వూరు వెళ్ళిపోతున్నావా?'' అనడిగాను.

''ప్రస్తుతం దేశమంతా ఒకసారి టూర్ చేయాలని ఉంది అన్నాడు.

ఇక ఆ తర్వాత 'ఏ ఆశ్రమంలోనైనా చేరతాడేమో?'' అనుకున్నాం'

ఇద్దరం విడిపోయాం.

మర్నాటి నుంచీ నా సంసారంలో మునిగితేలుతూ కేశవరావు గుర్తొచ్చినా ఉత్తరం రాసే తీరిక స్థిమితం లేకపోయాయి'.

ఆరు నెలల తర్వాత కేశవరావు నుంచి నాకు ఉత్తరం వచ్చింది. మద్రాసులో ఉన్నట్టున్నాడు. ఒకసారి వచ్చి చూసి పొమ్మంటూ రాశాడు.

కేశవరావు మద్రాసులో ఉన్నాడంటే.... రామకృష్ణ మిషన్‌లో చేరాడేమో?

ఒకసారి వెళ్ళి చూడాలనిపించింది. ఇంతలో అనుకోకుండా అక్కడొక పని వచ్చింది.

మా రెండో అమ్మాయికి మద్రాసులో ఒక సంబంధం వచ్చింది. అమ్మాయిని చూసి వెళ్ళారు. అమ్మాయి వారికి నచ్చింది. మిగిలిన విషయాలు మాట్లాడటానికి మద్రాసు రమ్మన్నారు.

వెంటనే బయలుదేరాను.

మద్రాసులో నా పని అయ్యాక కేశవరావు ఇచ్చిన అడ్రసు పుచ్చుకుని ఇల్లు వెతుక్కుంటూ బయలుదేరాను.

చివరకు అడ్రసు ప్రకారం ఒక రెండంతస్తుల భవనం ముందు నిలబడ్డాను.

''ఇది కేశవరావు ఇల్లా?''' సంశయంగా నేమ్ ప్లేటు చూశాను. అతని పేరే...

ఉద్యోగంలో ఉండగా అతడుండే, చిన్న గది గుర్తొచ్చింది. ఎవరైనా ఆ గది మారకూడదా' అంటే

''నాకు బాగానే ఉంది. మారాల్సిన అవసరం కనబడ్డేదు' అనేవాడు...

అటువంటి కేశవరావు ఈ భవంతిలో ఉంటున్నాడా? నమ్మశక్యం కాలేదు. గేటు తీసుకుని లోపలకు వెళ్లాను.

ఇంటి ముందు చక్కని పూలతోట...

ఆ పూల అందాల్ని చూస్తూ అడుగేస్తున్నాను.

''హల్లో! రాధాకృష్ణా... రా...''

ఆ మాటలకు తలెత్తాను. ఎదురుగా వరండాలోని కేన్ ఛెయిర్లో కూర్చున్నాడొక వ్యక్తి...

చప్పున గుర్తు పట్టలేకపోయాను.

''నేనే... కేశవరావుని'' నవ్వాడు.

షాక్ తిన్నట్లయ్యాను.

కేశవరావు గడ్డాలు - మీసాల్తో... కాషాయ బట్టల్లో ఉంటాడని ఎదురుచూస్తున్న నాకు... కేశవరావు సిల్కు లాల్చీ - గ్లాస్కో పంచ కళ్ళకు ఖరీదైన కళ్లజోడుతో కనబడేసరికి నోట మాట రాలేదు.

''నా ఉత్తరం అందిందా... నువ్వొస్తావని ఎదురు చూస్తూనే ఉన్నాను... రా!'' ఆప్యాయంగా ఆహ్వానించాడు.

''ఏమిటి?... నువ్వేనా''

ఉద్యోగ కాలంలో మురికి కొడుతూ నలిగిన బట్టల్తో ఉండే కేశవరావేనా! ఇతను' నఖశిఖ పర్యంతం ఆశ్చర్యంగా చూస్తున్నాను.

కేశవరావు నవ్వాడు.

''నేను చాలా మారాను కదూ! రిటైరయ్యాక ఇక్కడ ఈ మేడను కొన్నాను! అంతేకాదు పెళ్లి కూడా చేసుకున్నాను'' అంటూ భార్యని పిలిచి పరిచయం చేశాడు.

ఆమెకు సుమారు నలభై ఏళ్లుంటాయి. చూడతగ్గ అందం. ''కృష్ణా ఈమె వితంతువు. పదేళ్ల కొడుకు రోడ్డు ఏక్సిడెంట్‌లో మరణించాడు. పాపం 'నా' అన్నవాళ్లు లేరు''

కేశవరావు చేసిన పని నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

అతనిలో ఇంత అభ్యుదయ భావాలున్నాయనుకోలేదు. ఓఓకేశవ్! మీ జంట చాలా బాగుంది! నువ్వా ఇప్పుడు చాలా అందంగా ఉన్నావ్...''

నా మాటలకు కేశవరావు నవ్వాడు.

''కేశవ్' నువ్వేదో ఆశ్రమంలో చేరిపోయావనుకున్నాను'' అన్నాను దానికి కేశవరావు బిగ్గరగా నవ్వుతూ...

''నువ్వే కాదు... చాలా మంది అలాగే అనుకున్నారు! కానీ కృష్ణా! నేనూ మనిషినే కదా! నాకూ ఎన్నో కోరికలున్నాయి. కానీ ఏ కోరికైనా సుఖాన్నయినా సంపూర్తిగా అనుభవించాలని నా అభిమతం. అందుకే చదువు - ఉద్యోగ కాలంలో ఆ రెండింటి లోతుపాతుల్ని చూడాలని పూర్తి సమయాన్ని పుస్తకాలకే వెచ్చించి ఎన్నో డిగ్రీలు పొందాను. వ్యాసాలు రాశాను! ఇప్పుడిక సాంసారిక సుఖాల్ని అనుభవిస్తున్నాను. మా పెళ్లయ్యాక రెండు నెలల పాటు దేశమంతా తిరిగాం. ఆ తర్వాత మద్రాసు వచ్చి ఇక్కడ సెటిలయ్యా. ఈ మధ్యనే కారు కూడా కొన్నాను. ప్రస్తుతం మాకు కాలక్షేపంగా ఉంటుందని ఒక చిన్న స్కూలు ప్రారంభించాను. నా భార్య కూడా చదువుకుంది. ఇద్దరం క్లబ్బు మెంబర్లం. క్లబ్బు తరపున సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే మేమిప్పుడు ఎంతో హాయిగా జీవిస్తున్నాం!'' అన్నాడు.

కేశవరావు అలా చెప్తోంటే నోరు తెరుచుకుని వింటూ ఉండిపోయాను. ●